క్లుప్తంగా

జగనన్న విద్యాకానుక పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ బుడమేరు మధ్యకట్ట తమ్మిన దుర్గారావు నగరపాలక సంస్థ పాఠశాలలో గురువారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ జానారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం రోజు నుంచే జగనన్న విద్యాకానుక పంపిణీ చేయడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పని తీరును తెలియజేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక వికాసం



మధురానగర్(విజయవాడసెంట్రల్):యోగాతో మానసిక వికాసం పెంపొందించుకోవడం, అనారోగ్య సమస్యలు దరి చేరకుండా చూసుకోవచ్చని కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయులు బీఎస్వీ సీతారాం అన్నారు. సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయంలో గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వేడుకలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ యోగా చేస్తే మనసు ప్రశాంతంగా ఉండి, చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. వత్తిడి తగ్గించుకోవడానికి యోగా చక్కటి మార్గమన్నారు. నిత్య జీవితంలో భాగం కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో యోగా చేయించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయులు నసీమ్, ఏవీడీ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే జనభాగీదారీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలను కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎంపీ పర్యవేక్షించారు.

దుర్గగుడిలో పలువురికి విధుల కేటాయింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పలువురు అధికారులు, సిబ్బందికి విధులను కేటాయిస్తూ ఆలయ ఈవో భ్రమరాంబ గురువారం ఆదేశాలు జారీ చేశారు. దుర్గగుడి ఏఈవో బీవీ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తి వేసి, సత్రాలు, దత్తత దేవాలయాలు, కనకదుర్గ ప్రభ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. రికార్డు అసిస్టెంట్ జి. చిన్ని టోల్‌గేట్ నుంచి టికెట్ల స్కానింగ్ పాయింట్‌కు బదిలీ చేశారు. ఎం. ఆదిలక్ష్మి బస్టాండ్ ప్రసాదం కౌంటర్‌కు, అటెండర్ కె. పుల్లారావుకు బస్టాండ్ ప్రసాదం కౌంటర్ రెండో షిఫ్టు విధులు కేటాయించారు. జి. శ్రీదేవికి డోలు విధుల నుంచి పవిత్ర సారె కౌంటర్‌కు, ఎన్ఎంఆర్ టి. కమలమ్మను చెప్పుల స్టాండ్ నుంచి స్టేషనరీకి, పి.రవికుమార్‌కు పవిత్ర సారె నుంచి స్కానింగ్ పాయింట్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

4న తుమ్మలపల్లిలో రంగా జయంతి వేడుకలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వచ్చే నెల 4వ తేదీ వంగవీటి మోహన రంగా 76వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా జీవితాన్ని నేటితరం వారికి తెలియజేయాలని ఉద్దేశంతోనే జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజకీయలకు అతీతంగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం, వివిధ సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో కాపు సంఘం నాయకులు కొప్పుల వెంకట్ , రాజీనాల బాబ్జి ,బాడిత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి తోడుగా జగనన్న

జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సత్కరించి నగదు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ మూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి సీఎం జగనన్న తోడుగా ఉంటారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎం స్కూల్‌లో 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలిసి పాఠశాల ఆవరణలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రపంచ విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకుని పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట సత్కరించుకోవడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం స్థాయిల్లో విడివిడిగా జరిగే కార్యక్రమాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తారని తెలిపారు. సెంట్రల్‌లో పదో తరగతిలో ఏకేటీపీఎం స్కూల్‌కి చెందిన జోయల్ సుమంత 590 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలవడం అందరికీ గర్వకారణమని అన్నారు. వీవీ సుబ్బారెడ్డి స్కూల్‌కు చెందిన ప్రణతి సాయి 584 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో రెండో స్థానంలో ఉండగా, ఏకేటీపీఎం స్కూల్‌కి చెందిన కె.గగన్ సాయి 574 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కాలేజీకి చెందిన ఎస్.ప్రేమ్‌చంద్(ఎమ్‌పీసీ) 959 మార్కులు, ఎం.జితేంద్ర (బైపీసీ) 947 మార్కులు, డి.డేవిడ్ రాజు(హెచ్ఈసీ) 885 మార్కులు, పాయకాపురం జీజేసీ కాలేజీకి చెందిన కూరపాటి శ్రీనిష(సీఈసీ) 908 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనపరిచారని చెప్పారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన విద్యార్థులు చదువులో రాణించాలని మల్లాది విష్ణు ఆకాంక్షించారు. ఈ నెల 17న జిల్లా స్థాయిలో, 20న రాష్ట్ర స్థాయిలో జగనన్న ఆణిముత్యాలకు పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతాయని చెప్పారు. పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే కృతనిశ్చయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. నాలుగేళ్లలో విద్యారంగానికి అక్షరాలా రూ.60,329 కోట్లు ఖర్చు చేయడమే నిదర్శనమని చెప్పారు. అనంతరం విద్యార్థులను మెడల్స్‌తో సన్మానించి నగదు బహుమతిని అందజేశారు. అనంతరం తల్లిదండ్రులను శాలువాలతోను, విద్యాలయాల ప్రిన్సిపాల్స్, హెడ్ మాస్టర్లను మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయవాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి తోట వెంకటనాగేంద్ర కుమార్, ఏకేటీపీఎం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సరళ కుమారి, పాయకాపురం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ రెడ్డి, వీవీ సుబ్బారెడ్డి పాఠశాల హెడ్ మాస్టర్ కేవీ దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కలెక్టర్ ఢిల్లీరావు



పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వృద్ధాప్యం మలిదశ బాల్యమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వృద్ధులపై సమాజంలో వస్తున్న మార్పులు విచారకరమన్నారు. విదేశాల్లో జీవితం గడుపుతున్న సంతానం తమ తల్లిదండ్రులను బాధ్యతారహితంగా వదిలేస్తున్నారన్నారు. సంతానం తమ పట్ల నిర్లక్ష్యం చూపితే వారికి దాఖలు పరిచిన ఆస్తులను వెనక్కి తీసుకునేలా న్యాయ నిపుణుల సమక్షంలో పంపకాలు జరపాలన్నారు. కొన్ని దేశాల్లో వృద్ధులతో గౌరవభావంతో వ్యవహరిస్తూ నిర్దేశించిన చట్టాలు కూడా చాలా బలంగా ఉంటాయన్నారు. అటువంటి పరిస్థితి మన దేశంలో కూడా రావాలన్నారు. ఆశ్రమాల్లో నిరంతర పర్యవేక్షణకు సీసీ కెమెరాలు, వైద్య సేవలు, సిబ్బంది ప్రవర్తన, నిర్వాహకులు గత చరిత్ర వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. వృద్ధులను ఇబ్బంది పెట్టే వారి సంతానంపై కేసులు బనాయించాలని, ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు అమలు కాకపోతే చర్యలు తీసుకునే అధికారం ట్రిబ్యునల్ ఛైర్మన్ గా తనకు ఉందని గుర్తు చేశారు. డీఆర్వో కె.మోహన్ కుమార్ మాట్లాడుతూ జీవిత అనుభవంతో జ్ఞానం పొందిన బుద్ధులు వృద్ధులని పేర్కొన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఢిల్లీరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారాహి తొలి రోజు టూర్ అట్టర్ ఫ్లాప్

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): జనసేన అధినేత పవన్ కల్యాణ్ తొలి రోజు వారాహి టూర్ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ దగ్గర అవుతుండటంతోనే జన సైనికులు దూరమయ్యారని, నిన్నటితో ఆ విషయం తేటతెల్లమైందన్నారు. ఆ ఫ్రస్టేషన్‌తో ఏం మాట్లాడుతున్నారో కూడా పవన్‌కు తెలియడం లేదని మండి పడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మాట్లాడే ముందు స్థాయి తెలుసుకుంటే మంచిదని సూచించారు. పోటీ చేసిన రెండు చోట్ల ఘోరంగా ఓడిపోయినా, ఉత్తర కుమార ప్రగల్భాలను పవన్ నేటికి మానుకోలేదని ఎద్దేవా చేశారు. పవన్‌వి స్థిరత్వంలేని మాటలని, 2018–19 మధ్య టీడీపీ, నారా లోకేష్‌ను, కేంద్రంలోని బీజేపీని పవన్ తిట్టినన్ని తిట్లు ఎవరూ తిట్టలేదన్నారు. మళ్లీ ఇప్పుడు వారితో కలిసి ప్రయాణం చేస్తూ మంచి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ధ్వజమెత్తారు. 2014 నుంచి 2018 వరకు టీడీపీతో పాటు బీజేపీతో దోస్తీ చేసిన పవన్, చంద్రబాబు పాలనలో జరిగిన దుర్మార్గాలు, హత్యలు, మారణ హోమాలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారన్న అక్కసు, సంక్షేమ పాలన చూసి ఓర్వలేని తనం పవన్ మాటల్లో స్పష్టంగా కనిపించిందన్నారు. ధైర్యముంటే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఉన్న తెల్ల కార్డులు, ఈ ప్రభుత్వం మంజూరు చేసిన కార్డులు, అందించిన సంక్షేమంపై బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. అలాగే వారాహి టూర్లో పవన్ చేసిన దిగజారుడు విమర్శలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే విష్ణు డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర ప్రజలు క్షమించరని హెచ్చరించారు.

జగనన్న పాలనలో రోడ్లకు మహర్దశ



రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రోడ్లకు మహర్దశ పట్టిందని ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ బాలభవన్ వద్ద రూ.15.35 లక్షల వ్యయ అంచనాతో నిర్మించిన వీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం, ఆర్అండ్‌బీ కాలనీలో రూ.20 లక్షల వ్యయ అంచనాతో నూతన రహదారి నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టిసారిస్తోందని, 14,15 ఆర్థిక సంఘాలు, కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి ప్రజల అవసరాలను తీరుస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే నెల 4వ తేదీన వంగవీటి మోహనరంగా జయంతిని పురస్కరించుకొని భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ గత టీడీపీ హయంలో అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని, ప్రజల అవసరాలను తీర్చడంలో ఆ పార్టీ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈ గురునాథం, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, సచివాలయ కన్వీనర్లు కరీముల్లా, రాజశేఖర్, జ్యోతి, గోపిరెడ్డి, నాగబాబు, తోపుల వరలక్ష్మి, శర్మ, శోభన్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. సంప్రదాయ నృత్యాలు



విజయవాడ కల్చరల్: వాగ్గేయకార కీర్తనలకు పట్టాభిషేకం జరిగింది. చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. శారద కళా సమితి ఆధ్వర్యాన గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సామాజిక వేత్త డాక్టర్ జనాబ్ సయ్యద్ జాఫర్ సామాజిక సేవలను గుర్తించి హోలీ స్పిరిట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా సంప్రదాయ నృత్యాల ప్రదర్శన, జాఫర్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించింది. నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్, నాట్యాచార్య సప్త శివకుమార్ బృందం పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించాయి. కళాసమితి వ్యవస్థాపకుడు డోకిపర్తి శంకరరావు మాట్లాడుతూ ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసముందరన్నారు. జాఫర్ సేవలను గుర్తించి అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, శారద కళాసమితి కన్వీనర్ ఎంఆర్ ఎస్ ప్రకాశరావు పాల్గొన్నారు. నిర్వాహకులు జాఫర్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

బాబా మందిరంలో పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం శ్రీ సాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

రేషన్ కార్డు సమస్యల పరిష్కారంపై వీఆర్వోలకు అవగాహన కల్పించండి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రేషన్ కార్డు సమస్యల పరిష్కారంపై వీఆర్వోలకు పూర్తి అవగాహన కల్పించాలని ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను వారంలోపు సమర్పించాలని ఆదేశించారు. రేషన్ కార్డులను విడగొట్టే ప్రక్రియను వేగవంతం చేయాలని, రేషన్ వెహికల్ ఎప్పుడు వస్తుందనే సమాచారం కూడా కార్డుదారులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు.

వేలిముద్రలు, ఐరిస్ పడకపోతే ప్రత్యేక దృష్టి వహించి, వారికి కూడా సరుకులు పంపిణీ చేసే విధంగా చూడాలన్నారు. దేశంలోనే ఇంటి వద్దకు వచ్చి రేషన్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్య సాధనకు అధికారులు, సిబ్బంది పని చేయాలని కోరారు. సమీక్షలో డీఎస్ఓ రామ్మోహన్‌రావు, ఏఎస్ఓలు ధనుంజయరెడ్డి, శ్రీలక్ష్మి, ఆర్ఐలు పాల్గొన్నారు.

హోంగార్డుపై కేసు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వివాహితను వేధిస్తున్న ఓ హోం గార్డుపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవినగర్ రెండోలైన్‌కు చెందిన కనుమూరి జోత్స్న అనే మహిళకు శంకర్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉన్నారు. అయితే జోత్స్న చిన్ననాటి స్నేహితుడు, ప్రస్తుతం నూజివీడు ఫైర్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న నాగచైతన్య కొన్ని నెలల క్రితం ఆమెను విజయవాడ బస్‌స్టేషన్‌లో చూసి మాట్లాడి ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. ఆ తరువాత వారిద్దరూ కలిసి పలుమార్లు పార్కులకు కూడా వెళ్లేవారు. అయితే నాగచైతన్య ప్రవర్తనలో మార్పు రావడంతో జోత్స్న అతనితో మాట్లాడడం లేదు. అతను కొన్ని రోజుల నుంచి ఆమెకు ఫోన్లు చేసి బూతులు తిట్టడం, వాట్సాప్ స్టేటస్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడు. దీన్ని గమనించిన ఆమె నాగచైతన్యను హెచ్చరించినా మార్పు రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో పోలీసులు నాగచైతన్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళం పగలగొట్టి ఆభరణాలు చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వాకింగ్‌కు వెళ్లి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన భవానీపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. గొల్లపూడి పంచాయతీ రోడ్డులో నివసిస్తున్న పొన్నగంటి తార బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి వాకింగ్‌కు వెళ్లింది. రాత్రి 8. 30 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలోని 59 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.10లక్షల నగదు దొంగించారు. బాధితురాలి ఫిర్యాదుతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదస్థితిలో వ్యకి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): అనుమానాస్పద స్థితిలో పోరంకి తాతంరాజు(43) మృతి చెందినట్టు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు కండ్రిక కు చెందిన పోరింకి తాతంరాజు ఆటో నడుపుతుంటాడు. 16 ఏళ్ల క్రితం ఉషారాణితో వివాహమైంది. వారికి కుమారుడు, ఇద్దర కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా తాతంరాజు అతని తల్లి మహాలక్ష్మమ్మ వద్ద ఉంటున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో రేకులషెడ్డు రాడ్‌కు ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుని తల్లి మహాలక్ష్మమ్మ ఫిర్యాదుపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో 'సంక్షేమ' విప్లవం



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం నడుస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 62వ డివిజన్ 270 వార్డు సచివాలయ పరిధిలో గురువారం కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ప్రకాష్‌నగర్లో 280 కుటుంబాలను కలిశారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సైడ్ కాల్వల్లో మురుగును ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి సంక్షేమం అనే పదానికి అర్థం కూడా తెలియదని విమర్శించారు. నాలుగేళ్లలో రూ.3.45కోట్ల సంక్షేమాన్ని సచివాలయ పరిధిలో అందజేసినట్టు వెల్లడించారు.

మహాయజ్ఞంలా పేదలందరికీ ఇళ్లు

రాష్ట్ర ప్రభుత్వం మహాయజ్ఞంలా చేపట్టిన పేదలందరికి ఇళ్ల పథకం పనులు నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తొలి దశలో 14,814 ఇళ్లు ఉండగా, 9,759 ఇళ్లకు గ్రౌండ్ అయినట్లు వెల్లడించారు. ఇటీవల నిడమర్రులో 7,211 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. వీరితో పాటు 90 డేస్ ప్రోగ్రామ్ ద్వారా కొత్తగా 2,250 మంది అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేశామన్నారు. 300 చదరపు అడుగుల కేటగిరిలో సిద్ధంగా ఉన్న 400 టిడ్కో ఇళ్లను రూపాయికి రిజిస్ట్రేషన్ చేసి త్వరలో అందచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ రామకోటేశ్వరావు, సీడీఓ జగదీశ్వరి, డివిజన్ కోఆర్డినేటర్ వీరబాబు, నాయకులు అలంపూరు విజయ్,రామిరెడ్డి, మస్తాన్, బుజ్జి, బ్రహ్మేంద్ర, సాంబయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ స్టాండింగ్ కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్

అర్హులైన కార్పొరేటర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థలోని ప్రస్తుత స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీ కాలం ఈ నెల 28వ తేదీతో ముగియనుంది. ఈ సందర్భంగా 2023 కు నూతన స్టాండింగ్ కమిటీ ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నూతన స్టాండింగ్ కమిటీకి అర్హత కలిగిన కార్పొరేటర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఓటర్స్ జాబితాతోపాటు ఎలక్షన్ నోటీస్‌ను ఈ నెల 20వ తేదీన ప్రకటించనున్నారు. ఆ రోజు నుంచి 27వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్లను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ (జనరల్)కు ఫైల్ చేయాలని తెలిపారు. నామినేషన్లను అడిషనల్ కమిషనర్ 28వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు స్క్రూట్నీ చేసి అదే రోజున వ్యాలీడ్ (చెల్లుబాటైన) నామినేషన్ల జాబితాను వెల్లడించనున్నారు. జూలై ఒకటో తేదీ మధ్యాహ్నం 12 నుంచి 3 గంటలలోపు నామినేషన్లు ఉపసంహరించవచ్చు. ఫైనల్‌గా పోటీలో ఉన్న కార్పొరేటర్ల జాబితాను ప్రకటించనున్నారు. జూలై 5వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోలైన ఓట్లను లెక్కిస్తారు.

యువతకు స్ఫూర్తి.. మహాకవి శ్రీశ్రీ



శ్రీశ్రీ వర్థంతిలో అజయ్‌కుమార్, నారాయణరావు, గుండు నారాయణ, అశోక్‌కుమార్ తదితరులు

విజయవాడ కల్చరల్: యువతకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తి మహాకవి శ్రీశ్రీ అని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి పరమారి అజయ్‌కుమార్ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం, శ్రీశ్రీ సాహిత్యనిధి, సాహితీ మిత్రులు, సాహితీ ప్రవంతి, జాషువా సాంస్కృతిక వేదిక తదితర సంస్థల ఆధ్వర్యాన గురువారం మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు 40 వర్థంతిని తుమ్మపల్లి కళాక్షేత్రం సమీపంలోని శ్రీశ్రీ విగ్రహం వద్ద నిర్వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీశ్రీ తన సాహిత్యంతో యువతను కవిత్వం వైపు మళ్లించారని గుర్తు చేశారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ శ్రీశ్రీకి నగరంతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు సింగంపల్లి అశోక్‌కుమార్, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, గుండు నారాయణ, సత్యాజీ, దివి కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, అరుణ్‌కుమార్, గుజ్జల ఈశ్వరయ్య తదితరులు శ్రీశ్రీ సాహితీ సేవలను వివరించారు. శ్రీశ్రీ అభిమానులు ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. గాయకులు విప్లవ గీతాలను ఆలపించారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించండి

డీఎంహెచ్ఓ సుహాసిని



వైద్యులకు సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫ్యామిలీ ఫిజిషియన్ శిబిరాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని పేర్కొన్నారు. ఆమె గురువారం విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడు1 విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ప్రోగ్రామ్‌లో ప్రతిపాదించిన ప్రతి సేవను ప్రజలకు చేరవయ్యేలా వైద్యం అందించాలని పేర్కొన్నారు. అక్కడికి వైద్య సేవల కోసం వచ్చిన వారితో మాట్లాడారు. మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు, మందుల వివరాలు తెలుసుకున్నారు. వైద్య సేవలు అందిస్తున్న తీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సమీపంలోని ఎలిమెంటరీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల సరఫరా, పంపిణీని పరిశీలించారు. ఆ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులకు అందిస్తున్న పోషకాహారం పంపిణీ, పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ ద్రావణం పంపిణీ, అందుబాటుపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.